సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం
సంక్షేమ హాస్టళ్లలో పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణతే లక్ష్యంగా జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. 8లో



నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్
ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఆదివారం నుంచి ప్రారంభమయ్యే ప్రాక్టికల్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 8లో



అందరినీ అలరించే 'ఊరు పేరు భైరవకోన' 8లో



కబడ్డీ.. కబడ్డీ..

రెండో రోజూ హోరాహోరీ

- ఉత్కంఠగా ఆడుదాం ఆంధ్రా పోటీలు
- ఎనిమిది వేదికల్లో ఐదు క్రీడాంశాల్లో ఆటలు
- సత్తా చాటుతున్న క్రీడాకారులు

ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. నగరంలోని ఎనిమిది వేదికల్లో.. ఐదు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. శనివారం జరిగిన మెన్ వాలీబాల్ పోటీల్లో అనకాపల్లి జట్టు 2–1తేడాతో అనంతపురం జట్టుపై విజయం సాధించి తదుపరి రౌండ్‌కు చేరుకుంది. మెన్ ఖోఖోలో విశాఖపట్నం జట్టు 17–14 తేడాతో ఎన్టీఆర్ జట్టుపై విజయం సాధించింది. వుమెన్ బ్యాడ్మింటన్‌లో విశాఖ జట్టు 2–0 సెట్స్‌తో కోనసీమ జట్టుపై గెలుపొందింది. వుమెన్ క్రికెట్ పోటీల్లో అనంతపురం, విజయనగరం, ప్రకాశం, ఎన్టీఆర్, తిరుపతి జిల్లాలకు చెందిన జట్లు విజయం సాధించాయి. మెన్ విభాగంలో అన్నమయ్య జిల్లా, పల్నాడు, వైఎస్సార్ కడప, తిరుపతి, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం జట్లు గెలుపొందాయి. మెన్, వుమెన్‌కు ఏయూ గ్రౌండ్స్‌లో కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహిస్తుండగా.. వుమెన్ వాలీబాల్‌లో కాకినాడ, బాపట్ల, కృష్ణా, గుంటూరు, అనకాపల్లి జిల్లా జట్లు విజయం సాధించాయి. మెన్‌లో ప్రకాశం, నెల్లూరు, పార్వతీపురం మన్యం జట్లు గెలుపొందాయి. ముగింపు కార్యక్రమానికి సీఎం జగన్ విచ్చేస్తున్న సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఏర్పాట్లను పరిశీలించారు. - విశాఖ స్పోర్ట్స్





ఉత్కంఠంగా సాగుతున్న వుమెన్ కబడ్డీ పోటీలు



పట్టుకో.. పట్టుకో..



రెండో రోజు గెలిచిన తిరుపతి క్రికెట్ జట్టు

విజేతలు వీరే..

విశాఖ స్పోర్ట్స్: ఆడుదాం ఆంధ్రా ఫైనల్స్‌లో భాగంగా రెండో రోజు **జరిగిన పోటీల్లో** విజేతలు వీరే..

బ్యాడ్మింటన్: ఎంవీపీకాలనీలోని జీవీఎంసీ ఎస్–3 ఎన్‌క్లేవ్‌లో జరిగిన **వుమెన్ పోటీల్లో** పెదవాల్తేర్ 2, స్వర్ణా 2, ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ, ఎస్.కోట 4, **రమణయ్యపేట** 2, యమునాజాలవారి వీధి, శంకరాపురం 4, ద్రైదా, వేటమామిడి జట్లు **విజయం సాధించాయి**. మెన్‌లో శేఖర్ వీధి, కాగితాల పెంట, నెహ్రూచౌక్, బేరిపేట, **చోడవరం 3, మేట్ల** కాలనీ సచివాలయం జట్లు గెలుపొందాయి.

క్రికెట్: ఏఎంసీలో జరిగిన మెన్ క్రికెట్ పోటీల్లో అలమండ 1, కవిటి 1, **అనవర్తి 4 జట్లు** విజయం సాధించగా స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన పోటీల్లో మధురానగర్ 15, **గుర్రంకొండ 2,** మల్లమ్మ సెంటర్, లైట్‌పల్లెం సెంటర్ సచివాలయం జట్లు గెలుపొందాయి. వైఎస్సార్ స్టేడియం బీ మైదానంలో జరిగిన మహిళల క్రికెట్‌లో వెంకటాపురం, షికారుగంజి, చిరికూరపాడు, సిద్ధార్థనగర్ సెక్రటేరియట్ జట్లు విజయం సాధించాయి. కొమ్మాది కేవీకే స్టేడియం మైదానంలో జరిగిన పోటీల్లో ఎంఆర్ పల్లి 2, గోరిజవోలు, కురుదు సెక్రటేరియట్ జట్లు గెలుపొందాయి.

వాలీబాల్: ఏయూ సిల్వర్ జూబ్లీగ్రౌండ్స్‌లో వాలీబాల్ పోటీలు జరుగుతుండగా వుమెన్‌లో మామిడాలపాడు1, గుంతపల్లి, గౌరీశంకరాపురం, మున్సిఫ్ జంక్షన్, నిజామపట్నం 3, మెన్‌లో గంగపట్నం 1, 189 కొత్తపల్లే, బేతపూడి, గంగపట్నం1, గామల్లపాలెం , చినపచ్చిల సెక్రటేరియట్ జట్లు విజయం సాధించాయి.

కబడ్డీ: ఏయూ గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్స్‌లో కబడ్డీ, ఖోఖో పోటీలు జరుగుతున్నాయి. కబడ్డీ వుమెన్‌లో కారేడు 3, శంకడ, రామారావు కాలనీ, ఆమకతడు, పేరూరు1, నల్లచెరువుపల్లి, లాసన్స్‌బే కాలనీ సెక్రటేరియట్ జట్లు, కబడ్డీ మెన్‌లో గోలెగండ్ల 3, కొత్తపాలెం 2, చింతలపూడి 1, సింగుపురం 1, రాజాం సెక్రటేరియట్ జట్లు విజయం సాధించాయి.

ఖోఖో: మహిళా పోటీల్లో చిదుమూరు, కొండాయపాలెం, కుప్పిలి 1, సత్యనారాయణ కాలనీ, ఖాజీపాలెం, సంజయ్‌గాంధీనగర్, నాగులాపురం సెక్రటేరియట్ జట్లు, మెన్‌లో ముతుకూరు1, నిడమర్రు 2, నిడుగుర్తి, పెద్దారుకురు, పంగలూరు1, లంకెలపాలెం సెక్రటేరియట్ జట్లు గెలుపొందాయి.



పోటీలను తిలకిస్తున్న క్రీడాభిమానులు

భారతికి కేజీహెచ్‌లో చికిత్స

మహారాణిపేట: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన పోటీల్లో కడపకు చెందిన మోటూరి భారతి కింద పడిపోయారు. కడప, చిత్తూరు జట్ల మధ్య జరిగిన కబడ్డీ మ్యాచ్‌లో చిత్తూరు జట్టు రైడర్‌ను ఆపే ప్రయత్నంలో ఆమెకు గాయమైంది. వెంటనే నిర్వాహకులు అప్రమత్తమై భారతిని కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్‌తోపాటు పలువురు వైద్యుల బృందం పరీక్షించి.. ఆమె మెదడుకు సిటీ స్కాన్ తీశారు. డాక్టర్ బి.హెచ్.రావు ఆధ్వర్యంలో న్యూరో సర్జరీ విభాగంలో భారతికి చికిత్స అందిస్తున్నారు. ఆమె ఆరోగ్యం స్థిరంగానే ఉందని, ఇప్పుడు స్పృహలోనే ఉన్నట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ తెలిపారు. రెండు రోజుల పాటు వైద్య సేవలు అందించాల్సి ఉంటుందన్నారు. ఆమెను శాప్ మేనేజింగ్ డైరెక్టర్ ధ్యాన్‌చంద్, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తక్షణ సాయం కింద రూ.20వేలు అందజేశారు. ఆమె భర్త మోటూరి శివ, ఆమె సోదరుడు అక్కడే ఉన్నారు. క్రీడాకారులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని కలెక్టర్ మల్లికార్జున అధికారులను ఆదేశించారు.



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న భారతిని పరామర్శిస్తున్న శాప్ మేనేజింగ్ డైరెక్టర్ ధ్యాన్‌చంద్





హోరాహోరీగా సాగుతున్న వుమెన్, మెన్ వాలీబాల్ పోటీలు



సాధన చేస్తున్న క్రీడాకారిణులు



క్రీడా ప్రాంగణంలో ఐస్‌క్రీమ్‌లు తింటున్న క్రీడాకారులు

సంతృప్తిగా భోజనం



భోజనం స్వీకరిస్తున్న క్రీడాకారులు

- అడిగినంత పెడుతున్నారు
- ఏర్పాట్లు బాగున్నాయి
- ఆడుదాం ఆంధ్రా నిర్వహణపై క్రీడాకారుల సంతృప్తి

ఏయూక్యాంపస్: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఏర్పాట్లపై క్రీడాకారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థాయిలో ఉన్న తమను రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని వారంతా ప్రశంసిస్తున్నారు. క్రీడా పోటీల నిర్వహణ, వసతి, భోజనం, రవాణా, క్రీడా దుస్తుల వరకు అన్నీ సూపర్ అంటూ కితాబిస్తున్నారు. ఆడుదాం ఆంధ్రా ఫైనల్స్‌లో భాగంగా ఏయూలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు జరుగుతున్నాయి. ఇక్కడ ఏర్పాట్లపై శనివారం 'సాక్షి' పరిశీలించి.. క్రీడాకారులతో మాట్లాడింది. ఈ సందర్భంగా వారు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. క్రీడా పోటీల నిర్వహణ తమకు ఎంతగానో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. వసతుల పట్ల తాము పూర్తిగా సంతృప్తిగా ఉన్నామని స్పష్టం చేశారు.

వసతి, రవాణా పట్ల హర్షం

క్రీడల్లో పాల్గొన్న తమకు కల్పించిన వసతి, రవాణా పట్ల క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేశారు. బస చేసిన ప్రాంతం నుంచి ఏర్పాటు చేసి ప్రత్యేక బస్సుల్లో తాము క్రీడా ప్రాంగణాలకు వచ్చామన్నారు. తమకు అవసరమైన అన్ని వసతులు అధికారులు దగ్గరుంచి చూస్తున్నారని, తమకు ఎటువంటి ఇబ్బందులు లేవని చెప్పారు. క్రీడల్లో పాల్గొన్న ప్రతీ క్రీడాకారుడికి నాణ్యమైన దుస్తులను అందజేశారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు జరిగిన పోటీల్లో దుస్తులు అందజేశారని.. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా నూతనంగా దుస్తులు అందించారన్నారు.



క్రీడాకులకు భోజనం వడ్డిస్తున్న సిబ్బంది



క్రీడా ప్రాంగణాల్లో వైద్య శిబిరాల నిర్వహణ



భోజనాలు చేస్తున్న క్రీడాకారులు

అడిగినంత టిఫిన్, భోజనం

క్రీడాకారులకు రుచికరమైన టిఫిన్, భోజనాన్ని నిర్వాహకులు సమకూర్చారు. క్రీడా ప్రాంగణాల పక్కనే టిఫిన్, భోజనం కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఉదయం ఇడ్లీ, ఉప్మా, చట్నీ అందించారు. మధ్యాహ్నం భోజనంలో కార్న్‌తో చేసిన బిర్యానీ, స్వీట్, పొటాటో ఫ్రై, వెజిటబుల్ కుర్మా, అన్నం, సాంబార్, మజ్జిగ, అప్పడాలు వడ్డించారు. క్రీడాకారులు క్రమపద్ధతిలో క్రీడా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనశాలలో భోజనాలు చేశారు. క్రీడాకారులు కోరినంత టిఫిన్, భోజనం వడ్డించారు.

దుస్తులు బాగున్నాయి



రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్న మాకు ఇక్కడ అందించిన క్రీడా దుస్తులు చాలా బాగున్నాయి. కోట్, టీషర్ట్, ప్యాంట్ వంటివి ఎంతో నాణ్యంగా ఉన్నాయి. మేము గ్రామ, జిల్లా స్థాయిల్లో ఆడినపుడు వేరే దుస్తులు ఇచ్చారు. ఇప్పుడు కొత్తగా మరో డ్రెస్ ఇచ్చారు. క్రీడా దుస్తులు చాలా సౌలభ్యంగా ఉన్నాయి.

–టి.అపర్ణ, ఖోఖో క్రీడాకారిణి

భోజనం ఎంతో బాగుంది



అవసరమైనంత ఆహారం అందిస్తున్నారు. మళ్లీ వెళ్లి అడిగినా.. కావాల్సినంత పెడుతున్నారు. ఉదయం, మధ్యాహ్నం అందించిన టిఫిన్, భోజనం చాలా రుచికరంగా ఉన్నాయి. ఏర్పాట్లు బాగా చేశారు. మమ్మల్ని ప్రోత్సహిస్తూ.. ఇంత మంచి వసతులు కల్పించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– పి.జాహ్నవి, నంద్యాల

నాణ్యతలో రాజీలేదు



సాధారణంగా ఇటువంటి భారీ కార్యక్రమాలు నిర్వహించిన సందర్భంలో భోజన నాణ్యతలో కొంత రాజీ పడటం కనిపిస్తుంది. ఇక్కడ నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ లేకుండా ఆహారం అందిస్తున్నారు. ఇక్కడ అందించిన టిఫిన్, భోజనం ఎంతో రుచికరంగా ఉన్నాయి. వృథా చేయడం, పారవేయడం వంటివి జరగలేదు. క్రీడాకారులు ఎంతో సంతృప్తిగా తింటున్నారు.

– ఎస్.నాగేశ్వరరావు, రిఫరీ, కృష్ణా జిల్లా

ఉమ్మడి విశాఖ జిల్లా డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్‌గా అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి విశాఖ జిల్లా డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్‌గా గుడివాడ అమర్‌నాథ్‌ను నియమించారు. ఈ మేరకు శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ పనిచేస్తారు.

జ్ఞానం ప్రశ్నించడాన్ని నేర్పుతుంది

ఏయూక్యాంపస్: జ్ఞానం పశ్నించడాన్ని నేర్పుతుందని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు జి.హరగోపాల్ అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రజతోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య హరగోపాల్ విద్యారంగ సమస్యలు–విద్యార్థి ఉపాధ్యాయ జిమిలి ఉద్యమ ఆవశ్యకత అంశంపై మాట్లాడారు. ప్రజల తరఫున మాట్లాడే సంస్థగా డీటీఎఫ్ నిలుస్తోందన్నారు. విద్య కొందరి హస్తాల్లో చిక్కుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు విద్య సంస్థలు ప్రభుత్వ విద్యాసంస్థల ఉనికినే ప్రశ్నించే విధంగా ఉన్నాయన్నారు. తాను చదువుకున్న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అనేక విభాగాలు ఆచార్యులు లేక మూతబడే పరిస్థితికి చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో యూజీసీకి కేటాయింపులు భారీగా తగ్గించేశారన్నారు. విద్య ప్రయోజనం ఏమిటనే విషయం మరిచిపోతున్నారని, యాంత్రికంగా విద్యావంతులు మారిపోవడం నేడు చూస్తున్నామన్నారు. సమాజంలో ప్రజలకు స్వేచ్ఛను కల్పించడం ఎంతో అవసరమన్నారు. దేశానికి రాష్ట్రపతిగా చేసిన అబ్దుల్‌కలాం తనను ఒక ఉపాధ్యాయుడిగా ప్రజలు గుర్తుచేసుకోవాలని కోరుకున్నారన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో ప్రభావ వంతమైన వృత్తిగా నిలుస్తుందన్నారు. డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమణయ్య మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం పేరుతో విద్యారంగంపై దాడి జరుగుతోందన్నారు. విద్యారంగం కార్పొరేట్ల చేతుల్లో పడిపోయిందని చెప్పారు. ఏడో తరగతి వరకు మాతృభాషలో బోధన జరపాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు వరుణ్ కుమార్, శ్రీనివాసరావు, మధు, జార్జి, మాధవి, గట్ల చంద్రశేఖర్, రత్నం ఏసేపు రాష్ట్ర మాజీ అధ్యక్షులు కృష్ణయ్య, భానుమతి, ధర్మేంద్ర రెడ్డి, ముఖి రామకృష్ణ, టి.జోషి, కె.రామారావు, జయలక్ష్మి, సంతోషి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా డీటీఎఫ్ తీర్చిదిద్దిన వ్యాససంపుటి, కవితా సంపుటి, రజతోత్సవ సంచికను అతిథులు ఆవిష్కరించారు. గీతాలను చార్య హరగోపాలను ఆవిష్కరించారు.



సభకు హాజరైన ఉపాధ్యాయులు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య హరగోపాల్

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- వసతి గృహాల్లోని 10వ తరగతి విద్యార్థులపై ఫోకస్
- మంచి మార్కులు సాధించేలా తర్ఫీదు
- ఆత్మస్థైర్యం నింపేలా మోటివేషన్ క్లాసులు
- పరీక్షల వేళలో పసందైన పౌష్టికాహారం



అవగాహన కల్పిస్తున్న కన్వీనర్ రూపవతి



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య : సంక్షేమ హాస్టళ్లలో పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణతే లక్ష్యంగా జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానుండగా, వీటిని సమర్థంగా ఎదుర్కొని విద్యార్థులంతా మంచి మార్కులు సాధించేలా తర్ఫీదు ఇస్తున్నారు. పాఠశాలల్లో ప్రత్యేక తరగతులతోపాటు, హాస్టల్‌కు వచ్చిన తర్వాత కూడా విద్యార్థుల చదువులు ఎలా ఉన్నాయనేది పరిశీలించేలా హెచ్‌డబ్ల్యూవోలకు బాధ్యతలు అప్పగించారు. మిగతా విద్యార్థులకు దీటుగా వసతి గృహాల్లోని విద్యార్థులు సైతం మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా అధికారులు పర్యవేక్షణ పెంచారు. పరీక్షలకు సిద్ధమౌతున్న విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, వారికి తగిన పౌష్టికాహారం అందించేలా ఏర్పాట్లు చేశారు.

విద్యారంగ నిపుణులతో అవగాహన

సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 11 వసతి గృహాల నుంచి బాలురు – 48, బాలికలు – 36 మంది, అదే విధంగా బీసీ సంక్షేమ హాస్టళ్ల నుంచి బాలురు – 107, బాలికలు – 46 మంది పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. 2022 – 23 విద్యా సంవత్సరంలో వసతి గృహాల్లో ఉంటూ పరీక్షలు రాసిన వారిలో 84 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది నూరుశాతం ఫలితాలు సాధించేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. హాస్టళ్ల వారీగా పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులను గుర్తించి, వారందరినీ ఒకచోటకు చేర్చి, పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలనే దానిపై విద్యారంగ నిపుణులతో అవగాహన కల్పిస్తున్నారు.

ఆత్మస్థైర్యం నింపేలా...

సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులను సైతం చదువుల్లో తురుపుముక్కల్లా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి వైఎస్‌.జగన్‌మోహన్‌ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గతేడాది 565 మార్కులతో బీసీ సంక్షేమ శాఖ పరిధిలో ఓ విద్యార్థి జిల్లా టాపర్‌గా నిలిచాడు. అలాంటి వారికి తగిన గుర్తింపు ఇచ్చేలా వారితో వసతి గృహాల్లోని విద్యార్థులతో మాటామంతీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో ఆత్మస్థైరాన్ని నింపి, వారిని పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు.

ప్రతీ విద్యార్థిపై శ్రద్ధ



వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, వారు రాణించేలా తర్ఫీదు ఇస్తున్నాం. మా హాస్టళ్లలో చదువుకొని, గతేడాది టాపర్లుగా నిలిచిన విద్యార్థులను పిలిపించి, వారు ఎలా చదువుకున్నారనేది తోటి విద్యార్థులకు తెలిపేలా ఏర్పాట్లు చేశాం. ఇది విద్యార్థులకు ఎంతో ప్రేరణగా ఉంది. నిపుణులైన వారితో మోటివేషన్‌ తరగతులు కూడా నిర్వహిస్తున్నాం.

– కె.రామారావు, డిప్యూటీ డైరెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ, విశాఖ జిల్లా

ప్రత్యేక తరగతులపై పర్యవేక్షణ



పదో తరగతిలో విద్యార్థులంతా పాసయ్యేలా తర్ఫీదు ఇస్తున్నాం. అన్ని వసతి గృహాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల ప్రగతిని అంచనా వేసి, వెనుకబడిన వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేశాం. వసతి గృహాలను తరచూ సందర్శిస్తున్నాం. హాస్టల్‌ వెల్ఫేర్‌ అధికారులను అప్రమత్తం చేస్తున్నాం.

– శ్రీదేవి, డిప్యూటీ డైరెక్టర్, బీసీ సంక్షేమ శాఖ, విశాఖ జిల్లా

అందరిని అలరించే 'ఊరు పేరు భైరవకోన'

హీరో సందీప్‌ కిషన్‌ వెల్లడి



హీరోయిన్‌ వర్షతో సందీప్‌ కిషన్‌

ఎంవీపీకాలనీ: అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే సినిమా 'ఊరు పేరు భైరవకోన' అని హీరో సందీప్‌ కిషన్‌ అన్నారు. మ్యూజికల్‌ టూర్‌లో భాగంగా చిత్ర యూనిట్‌ శనివారం ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా సందీప్‌ కిషన్‌ మాట్లాడుతూ హర్రర్, వినోదం, ప్రేమ, కమర్షియల్‌ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను రూపొందించినట్లు వెల్లడించారు. అన్ని వర్గాల ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకొని ఈ సినిమాను తెరకెక్కించినట్లు తెలిపారు. ప్రధానంగా యువత ఈ సినిమాను చూసి బాగా ఎంజాయ్‌ చేస్తారన్నారు. ప్రేక్షకులకు ఫుల్‌మీల్స్‌ లాంటి ఈ సినిమా ఈ నెల 16వ తేదీన రిలీజ్‌ అవుతుందని తెలిపారు. ఈ నెల 14వ తేదీన చిత్ర ప్రీమియర్‌ షోను వంద స్క్రీన్లపై ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. టైగర్, ఎక్కడికి పోతావు చిన్నవాడా ఫేమ్‌ దర్శకుడు ఆనంద్‌ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారన్నారు. బ్రహ్మజీ, వైవా హర్ష, రవిశంకర్‌లు ముఖ్యపాత్రలు పోషించారని తెలిపారు. శేఖర్‌ చంద్ర ఈ చిత్రానికి సంగీత దర్శకత్వం వహించారన్నారు. పాడేరు, అదిలాబాద్‌ జిల్లాల్లో ఈ సినిమాను ఎక్కువగా చిత్రీకరించినట్లు తెలిపారు. హీరోయిన్‌ వర్ష మాట్లాడుతూ ఇందులో భూమి అనే పాత్రను తాను పోషించినట్లు తెలిపారు. కొత్త సినిమాలను ఆదరించే తెలుగు ప్రేక్షకులకు ఈ చిత్రం బాగా నచ్చుతుందన్నారు. తన పాత్రకు స్వయంగా తానే డబ్బింగ్‌ చెప్పినట్లు చెప్పారు. ఈ చిత్రంలో మరో హీరోయిన్‌గా కావ్యథాపర్‌ నటించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు చిత్రయూనిట్‌ సభ్యులు పాల్గొన్నారు.

నేవీ నిర్వాసితులకు రూ. 28.74 కోట్లు మంజూరు

- ఒక్కొక్కరికీ రూ.1.30 లక్షలు
- 2,211 మందికి లబ్ధి
- సోమవారం నుంచి లబ్ధిదారుల ఖాతాలకు జమ
- ఎమ్మెల్యే యువీ రమణమూర్తిరాజు వెల్లడి

రాంబిల్లి: నేవీ నిర్వాసితులకు జీవన భృతి ప్యాకేజీ మంజూరైనట్టు ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) తెలిపారు. శనివారం ఆయన విలేకరులకు జీవనభృతి వివరాలను వెల్లడించారు. వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాలకు చెందిన 2,211 మంది నేవీ నిర్వాసితుకు ఒక్కొక్కరికీ రూ.1.30 లక్షల చొప్పున మొత్తం రూ.28,74,30,000 మంజూరయ్యాయని, ఈ నగదును సోమవారం నుంచి లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరుగుతుందన్నారు. సోమవారం ప్రారంభమై వారం, పది రోజుల్లో మొత్తం లబ్ధిదారులందరి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. మత్స్యకారులు జీవన భృతి కోసం ధర్నాలు చేశారని, నిర్వాసితుల ఆవేదనను ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి జీవనభృతి ప్యాకేజీ మంజూరు చేయాలని కోరానన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్‌ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నేవీ నిర్వాసితులకు ప్యాకేజీ మంజూరు కావడం ఆనందం ఉందని ఎమ్మెల్యే తెలిపారు.

నిర్వాసితుల్లో ఆనందం

జీవన భృతి ప్యాకేజీ కోసం సుదీర్ఘకాలంగా నేవీ నిర్వాసితులు పోరాడుతున్నారు. ధర్నాలు, ఆందోళనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వాసితులకు అండగా నిలిచింది. అర్హులైన 2,211 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేసింది. వీరికి రూ.1,30,000 చొప్పున ప్యాకేజీ మంజూరు చేసింది. దీంతో వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. భారీ ప్యాకేజీ మంజూరు కావడంపై పార్టీలకతీతంగా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సొమ్ము తమ అవసరాలకు ఎంతో ఉపయోగపడుతుందని లబ్ధిదారులు చెబుతున్నారు. తమ పోరాటాలకు ఫలితం దక్కిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్‌లోకి సరికొత్త బజాజ్‌ పల్సర్‌ బైక్‌లు



మొదటి ఖాతాదారుడికి తాళం అందిస్తున్న యాజమాన్య ప్రతినిధులు

టీచర్లోడ్డు: దేశంలో అమితంగా ఇష్టపడే పల్సర్‌ శ్రేణిలో సరికొత్త పల్సర్‌ ఎన్‌150 ట్విన్‌ డిస్క్, ఎన్‌ 160 బైక్‌లు విశాఖ మార్కెట్‌లోకి విడుదలయ్యాయి. సిరిపురంలోని వరుణ్‌ బజాజ్‌ షోరూంలో శనివారం బజాజ్‌ ఆటో ఏఎస్‌ఎం అబాస్‌ శేఖరన్‌ వీటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మొదటి వాహనం కొనుగోలు చేసిన ఖాతాదారుడికి తాళాలు అందజేశారు. ఈ ద్విచక్ర వాహనాల్లో సరికొత్త ఇన్ఫినిటీ డిస్‌ప్లే కన్సోల్‌ పొందుపరిచినట్లు శేఖరన్‌ తెలిపారు. గేర్‌ పొజిషన్‌ ఇండికేటర్, మొబైల్‌ నోటిఫికేషన్‌ అలర్ట్స్, రైడ్‌ చేస్తూనే మొబైల్‌ కాల్‌ అంగీకరించడం, తిరస్కరించే సౌలభ్యం ఉందన్నారు. వరుణ్‌ బజాజ్‌ సీఈవో శ్రీనివాస్‌ మాట్లాడుతూ పల్సర్‌ విడుదలైన నాటి నుంచి ఎంట్రీ లెవల్‌ స్పోర్ట్స్‌ బైకింగ్‌ సెగ్మెంట్‌లో సంచలనాలు సృష్టించి.. అత్యధికంగా అమ్ముడవుతున్న బైక్‌గా నిలిచిందన్నారు. ఎన్‌ 150 ట్విన్‌ డిస్క్‌ ఎక్స్‌ షోరూం ధర రూ.1,24,096, ఎన్‌ 160 ధర రూ.1,32,614 గా నిర్ణయించినట్లు తెలిపారు.

నేటి నుంచి ఇంటర్‌ ప్రాక్టికల్స్‌

- జిల్లాలో 129 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 37,927 మంది విద్యార్థులు



కృష్ణా కాలేజీలో ప్రాక్టీస్‌ చేస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య: ఇంటర్మీడియట్‌ జనరల్‌ కోర్సులు (ఎంపీసీ, బైపీసీ) అభ్యసించే విద్యార్థులకు ఆదివారం నుంచి ప్రారంభమయ్యే ప్రాక్టికల్‌ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 37,927 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో ఎంపీసీ 32,982 మంది, బైపీసీ 4,945 మంది ఉన్నారు. జిల్లాలో 129 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం నుంచి ఈ నెల 20 వరకు పది రోజుల పాటు పరీక్షలు నిర్వహించేలా షెడ్యూల్‌ ప్రకటించారు. నాన్‌ జంబ్లింగ్‌ విధానంలో ప్రాక్టికల్‌ పరీక్షలు జరుగుతున్నందున ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఇంటర్‌ బోర్డు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

ప్లస్‌ టూ, కేజీబీవీలకు సమీప కాలేజీల్లో..

జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన 173 జూనియర్‌ కాలేజీలు ఉండగా, వీటిలో 129 కాలేజీల్లోనే ప్రాక్టికల్‌ పరీక్షలకు కేంద్రాలుగా ఎంపిక చేశారు. 50 మంది లోపు విద్యార్థులు ఉన్న కాలేజీలు, ప్రాక్టికల్స్‌కు అనువైన ప్రయోగశాలలు లేని వాటిని పక్కన పెట్టారు. ప్రాక్టికల్‌ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఇంటర్మీడియట్‌ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పి.మురళీధర్‌ తెలిపారు. ప్రత్యేక తనిఖీ బృందాలతో కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల్లో జరిగే ప్రాక్టికల్స్‌ పరీక్షలపై నిఘా పెట్టామన్నారు.

సత్యనారాయణస్వామి ఆలయ ఈవో బదిలీ

మహారాణిపేట: సుదీర్ఘకాలం తర్వాత దేవదాయ శాఖలో ఈవోలకు పదోన్నతులు, బదిలీలు జరిగాయి. ఈ మేరకు దేవదాయశాఖ కమిషనర్‌ ఎస్‌. సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఇసుకకొండ శ్రీ సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఈవో బి.నగేష్‌బాబును సహాయ కమిషనర్‌గా పదోన్నతి కల్పించి తూర్పుగోదావరి జిల్లా మావుళ్లమ్మ దేవస్థానం ఈవోగా నియమించారు.

పోలీసే దొంగ..!

- హెచ్‌పీసీఎల్‌లో భారీ దొంగతనం
- రూ.కోటి విలువైన సామగ్రి తరలింపు
- సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ కీలక పాత్ర
- దొంగ పాస్ సృష్టించి సరకు మాయం చేసిన వైనం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన హెచ్‌పీసీఎల్ అధికారులు
- వివరాలు వెల్లడించేందుకు నిరాకరణ

మల్కాపురం: అధికారం అడ్డం పెట్టుకుని ఓ సీఐఎస్‌ఎఫ్ పోలీసు కానిస్టేబుల్ హెచ్‌పీఎల్ సంస్థకే కన్నం వేశాడు. సుమారు రూ.కోటి సొత్తు దర్జాగా లారీలో తరలించుకుపోయాడు. సంస్థ అధికారుల తనిఖీల్లో సరకు మాయం కావడంతో శుక్రవారం పోలీసులు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించేందుకు అటు సంస్థ అధికారులు, ఇటు పోలీసులు నిరాకరిస్తున్నారు. హెచ్‌పీసీఎల్‌లో రెండేళ్ల నుంచి సుమారు రూ.26 వేల కోట్లతో విస్తరణ పనులు జరుగుతున్నాయి. విలువైన పరికరాలు ఇతర రాష్ట్రాల నుంచి, వివిధ దేశాల నుంచి తీసుకువస్తున్నారు. ఈ పరికరాలపై హెచ్‌పీసీఎల్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ కన్ను పడింది. పక్కా స్కెచ్ వేశాడు. విస్తరణ పనులు జరుగుతున్న స్థలంలో ఉన్న విలువైన సామగ్రి తరలించేందుకు ప్లాన్ చేశాడు. ఓ లారీకి దొంగ ఎంట్రీ పాస్ సృష్టించాడు. దొంగ పాస్‌తో యలమంచిలి పెంటారావు అనే వ్యక్తిని సంస్థలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా సృష్టించాడు. గత నెల 29వ తేదీన లారీలో విలువైన సామగ్రి లోడ్ చేయించాడు. వాటిని శశికుమార్ అనే స్క్రాప్ యజమానికి విక్రయించేందుకు యత్నించాడు. ఇదిలావుండగా విస్తరణ పనులు పరిశీలించే క్రమంలో హెచ్‌పీసీఎల్, సీఐఎస్‌ఎఫ్ అధికారులకు సరుకు మాయం అయినట్టు అనుమానం కలిగింది. ప్రాథమిక విచారణలో నిర్ధారణ కావడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సరకు మాయం చేసిన ప్రధాన నిందితుడు సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌తో పాటు, పెంటారావు, స్క్రాప్ దుకాణదారుడు శశికుమార్‌లను పోలీసులు అదుపులో తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది. ఈ వ్యవహారంలో మరో వ్యక్తి కూడా ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. వివరాలు చెప్పేందుకు పోలీసులు నిరాకరిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉందని త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని మల్కాపురం పోలీసులు చెబుతున్నారు.


హెచ్‌పీసీఎల్ మెయిన్ గేట్

డిఫెన్స్ మద్యం పట్టివేత

సీతమ్మధార: అక్రమంగా డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ డా.రవిశంకర్ ఆదేశాల మేరకు అడిషనల్ కమిషనర్ స్పెషల్ బ్రాంచ్ వెంకటరావు నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలయ్యశాస్త్రి లేఅవుట్, డోర్ నంబర్.49–54–6/6 ఇంట్లో అక్రమంగా డిఫెన్స్ మద్యం బాటిల్స్ నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్సు పోలీసులు సోదా చేసి, ఒకర్ని అదుపులోకి తీసుకున్నారు. ఆయన నుంచి 88 డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ మల్లేశ్వరరావు చెప్పారు. కేసుకు ఫోర్త్ టౌన్ పోలీసులకు అప్పగించారు.


మద్యం బాటిల్స్‌తో నిందితుడు

జర్నలిస్టులకు వైద్య పరీక్షలు

మహారాణిపేట: సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించే పాత్రికేయుల పాత్ర సమాజంలో కీలకమైనదని కలెక్టర్ మల్లికార్జున అన్నారు. 2023–24 సంవత్సరంలో అక్రెడిటేషన్ పొందిన జర్నలిస్టులు డాల్ఫిన్ డయోగ్నస్టిక్ సెంటర్లో ఉచితంగా టెస్టులు చేయించుకునేలా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జర్నలిస్టులకు ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించేందుకు డాల్ఫిన్ డయాగ్నోస్టిక్స్ ముందుకు వచ్చిందన్నారు. ఈ అవకాశాన్ని గతంలో ఉచితంగా టెస్టులు చేయించుకోలేని జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోలాహలంగా గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం


కొత్తపాలెంలో సారె ఊరేగిస్తున్న మహిళలు


ఆకట్టుకున్న కాంతారా నృత్య రూపకం

గోపాలపట్నం: కొత్తపాలెంలో శనివారం గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు గౌరీపరమేశ్వరులకు విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దేవేరులకు సారె సమర్పించారు. సాయంత్రం జరిగిన పరసలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కొత్తపాలెం జంక్షన్ నుంచి భగత్‌సింగ్ నగర్ వరకు రహదారి జనంతో కిటకిటలాడింది. చిన్నారులను ఆకట్టుకునేలా జెయింట్ వీల్, స్ప్రింగ్ జంపింగ్ వంటి ఆకట్టుకున్నాయి. వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన స్టేజ్ వద్ద జనం అధిక సంఖ్యలో గుమిగూడారు. జబర్దస్త్ నటులు రైజింగ్ రాజు, దొరబాబు యాంకర్లుగా వ్యవహరించి ఉత్సాహపరిచారు. కాంతారా నృత్య రూపకం విశేషంగా అలరించింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 89వ వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, మాజీ కార్పొరేటర్ అయితంశెట్టి కోటేశ్వరరావు, గేదెల మురళీ కృష్ణ, సీపీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు పాల్గొన్నారు.


స్కిట్ ప్రదర్శిస్తున్న జబర్దస్త్ నటులు రైజింగ్ రాజు, దొరబాబు

ఫిర్యాదుదారులకు సౌకర్యాలు కల్పించాలి

పీఎంపాలెం: వివిధ సమస్యలపై ఫిర్యాదు చేయడానికి దిశా పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు సదుపాయాలు కల్పించాలని నగర జాయింట్ పోలీస్ కమిషనర్ కె. ఫకీరప్ప ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆయన దిశా పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. విధుల్లో ఎటువంటి అలసత్వం వహించినా అధికార దుర్వినియోగానికి పాల్పడినా శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


అధికారులకు సూచనలు చేస్తున్న నగర జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప

విశ్రాంత అధికారులు అపూర్వ కలయిక


సమావేశమైన విశ్రాంత అధికారులు

సీతమ్మధార: హెచ్ఎస్ఎల్ రిటైర్డ్ అధికారులు నగరంలోని ఆశీలమెట్టలోని ఓ హోటల్లో కలుసుకున్నారు. ఈ అపూర్వ కలయిక సరదాగా సాగింది. 28 మంది అధికారులు హాజరై నాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. పదవీ విరమణ అనంతరం వారి జీవితాలు ఎలా కొనసాగుతున్నాయో షేర్ చేసుకున్నారు. కార్యక్రమంలో గోవింద్, చంద్రశేఖర్, డి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

పెదగంట్యాడ: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి యారాడ సముద్రంలో దూకి శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. న్యూపోర్టు సీఐ దాలిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని సింహాచలం ప్రాంతం ఈస్ట్‌పాయింట్ కాలనీకి చెందిన కర్రి కనక కిశోర్ కుమార్ (40) ఎంఈఎస్‌లో ఓ కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పని చేసేవాడు. ఏడాది క్రితం నుంచి ఆయన సొంతంగా కాంట్రాక్ట్ పనులు ప్రారంభించాడు. ఈ నేపథ్యంలో పనులు సక్రమంగా లేకపోవడంలో అప్పులపాలయ్యాడు. ఆర్థిక ఇబ్బందుల నుంచి తప్పించుకోలేక చివరకు సముద్రంలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో యారాడ తీరంలోని అగ్రిగోల్డ్ బీచ్ వద్ద రాళ్ల పక్కన కిశోర్‌కుమార్ మృతదేహాన్ని లైఫ్‌గార్డ్స్ వెంకటేష్, లోవరాజు, శ్రీనివాస్ గుర్తించారు. వెంటనే వారు ఆ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. న్యూపోర్టు పోలీసులకు సమాచారం అందించారు. న్యూపోర్టు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అతని వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా మృతుడ్ని గుర్తించారు. వెంటనే మృతుని సోదరుడు కేఎస్ ప్రకాశరావుకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుని సోదరుడు ప్రకాశరావు ఫిర్యాదు మేరకు న్యూపోర్టు సీఐ దాలిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కర్రి కనక కిశోర్ కుమార్ మృతదేహం

వచ్చే నెల 25న మానవ హక్కుల సదస్సు

డాబాగార్డెన్స్: మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్రస్థాయి సదస్సు వచ్చే నెల 25న విజయవాడలో నిర్వహించనున్నట్టు కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు పి. జగన్మోహన్‌రావు, రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. కౌన్సిల్ కార్యాలయంలో శనివారం వారు మాట్లాడారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ పౌరులకు అందుబాటులో లేదని ఆరోపించారు. హక్కుల ఉల్లంఘనతో బాధితులవుతున్న వారికి ఉపశమనం గాని, నష్టపరిహారం గాని లభించడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నకిలీ స్వచ్ఛంద సంస్థలను అరికట్టలేకపోతున్నాయని, వాటి అక్రమాలు నియంత్రించడం లేదని కేంద్ర హోంశాఖ తీరు అధ్వానంగా ఉందని శ్యామ్‌ప్రసాద్ ఆరోపించారు. కౌన్సిల్ గౌరవ అధ్యక్షుడు ప్రొఫెసర్ వై. సత్యనారాయణ అధ్యక్షతన విజయవాడలో నిర్వహించనున్న సదస్సుకు లా కమిషన్ చైర్మన్ జస్టిస్ రితురాజ్ అవస్తి, ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయభారతి హాజరవుతారని తెలిపారు.

బోడిదొరకు మెరుగైన వైద్యం అందించాలి

మహారాణిపేట: స్వాతంత్ర్య సమరయోధుడు దివంగత మల్లుదొర మనవడు బోడిదొరను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు శనివారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన బోడిదొర కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న శంకరరావు పరామర్శించారు. బోడిదొరకు మెరుగైన వైద్యం అందించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ప్రస్తుతం అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ఆర్ఎంవోలు డాక్టర్ లక్ష్మీ తులసీ, డాక్టర్ జగదీష్, సహాయ గిరిజన సంక్షేమ అధికారి సుబ్రహ్మణ్యం, కేజీహెచ్ ఎస్టీ సెల్ వైద్యులు పాల్గొన్నారు.


బోడిదొరను పరామర్శిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

గోపాలపట్నం: జాతీయ రహదారిపై లారీ ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన కాకానినగర్ జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బోనంగి లక్ష్మినివాస్(19) స్నేహితునితో కలిసి ద్విచక్రవాహనంలో ఎన్ఏడీ నుంచి కూర్మన్నపాలెం సమీప రాజీవ్‌నగర్‌లో గల తన ఇంటికి వెళ్తున్న సమయంలో కాకానినగర్ జంక్షన్ సమీప బస్‌స్టాప్ వద్ద ట్యాంకర్‌లారీ ఢీకొంది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న లక్ష్మినివాస్ లారీ చక్రాల కిందకు వెళ్లిపోయాడు. ఇది గమనించిన ఆటో డ్రైవర్ తన ఆటోలో కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించారు. సమాచారం తెలుసుకున్న ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్, సీఐ ప్రసాద్ ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. వెనుక కూర్చున్న స్నేహితుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. లారీ కోర్బా నుంచి హెచ్‌పీసీఎల్‌కు వెళ్తుంది. మృతుడు బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి బోనంగి కృష్ణ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. డ్రైవర్ వెంకటేష్‌ను అదుపులోకి తీసుకున్నారు.

గంగారావును విచారించిన సీపీ

పీఎంపాలెం: తీవ్ర సంచలనం సృష్టించిన తహసీల్దార్ సనపల రమణయ్య హత్య కేసులో రిమాండ్ ఖైదీ, ప్రస్తుతం పోలీస్ కస్టడీలో ఉన్న మురారి సుబ్రహ్మణ్యం గంగారావును పోలీసు కమిషనర్ ఎ.రవిశంకర్ శనివారం పీఎంపాలెం పోలీస్‌స్టేషన్‌లో విచారించారు. హత్యకు గల కారణాలపై ఆరా తీశారు. రిమాండ్ ఖైదీగా ఉన్న గంగారావును పూర్తిస్థాయిలో విచారించడానికి గానూ పోలీస్ కస్టడీకి అప్పగించాలని పోలీసులు న్యాయస్థానానికి విన్నవించగా.. కోర్టు అనుమతించింది. ఐదు రోజుల పాటు పోలీస్ కస్టడీ విధించింది. ఆయన్ని ఈ నెల 12వ తేదీ వరకు విచారించనున్నారు. జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప, క్రైం ఏసీపీ వెంకటరావు, డీసీపీ మణికంఠ, సీఐ వై.రామకృష్ణ పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు దరఖాస్తు చేయండి

మహారాణిపేట: ఓటరు నమోదు కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున తెలిపారు. వచ్చే ఎన్నికల నామినేషన్లు దాఖలు చేసే చివరి పది రోజుల ముందు వరకు వచ్చిన అన్ని ఫారం-6లను ఓటరు జాబితాలో నమోదు చేస్తామని, వారికి రానున్న సాధారణ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకొనే అవకాశం ఉంటుందన్నారు. ఎవరి పేరు అయినా ఇది వరకు ప్రచురించిన ఓటరు జాబితాలో ఉండి ప్రస్తుతం ప్రచురించబడిన ఓటరు జాబితాలో లేకపోతే హెల్ప్ లైన్‌లో కాని voter.eci.gov.inలో కాని పరిశీలించుకోవచ్చన్నారు. చిరునామా మార్పు కోసం అయితే ఫారం-8ను దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 సెక్షన్ 17,18 ప్రకారం ఒక వ్యక్తికి ఒకటి కన్నా ఎక్కువ సంఖ్యలో ఓటరుగా నమోదు కాబడి ఉండరాదన్నారు.



విద్యుత్ మీటర్ అమరుస్తున్న సిబ్బంది

పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా రాష్ట్రంలో పెద్ద ఎత్తున గృహ నిర్మాణాలు సందడిగా సాగుతున్నాయి. ప్రజల జీవన ప్రమాణాలు పెంచే దిశగా జాతీయ స్థాయి ప్రమాణాలకు మించి లోగిళ్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. ఉచితంగా గృహోపకరణాలు, కాలనీల్లో మెరుగైన మౌలిక వసతులు, సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో ఇళ్ల నిర్మాణం ద్వారా వైఎస్సార్-జగనన్న కాలనీల్లో పేదలకు ఉత్తమ జీవన ప్రమాణాలు సమకూరనున్నాయి. ప్రతి ఇంటికీ విద్యుత్ సౌకర్యాన్ని కలిస్తోంది. ఈపీడీసీఎల్ పరిధిలోని జగనన్న కాలనీల్లో విద్యుత్ సరఫరా పనులు చకచకా సాగుతున్నాయి. ఏకంగా 4,642 గృహ సముదాయాల్లో 4,72,124 ఇళ్లకు విద్యుదీకరణ పనులు **రూ.1198.52 కోట్లతో జరుగుతున్నాయి.**

జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగులు





విద్యుత్ కాంతుల్లో కణమాం, వెల్లంకి జగనన్న కాలనీలు

- ఈపీడీసీఎల్ పరిధిలో చురుగ్గా కొనసాగుతున్న పనులు
- 4,642 లేఅవుట్స్‌లో 4,72,124 ఇళ్లకు విద్యుదీకరణ పనులు
- రూ.1198.52 కోట్లతో పనులు ప్రారంభించిన ఈపీడీసీఎల్
- ఇప్పటి వరకు 1,86,776 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు
- రూ.704 కోట్ల విలువైన పనులు పూర్తి చేసిన అధికారులు
- 3,466 కాలనీల్లో 6,318 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

సాక్షి, విశాఖపట్నం : నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా నిర్మాణమవుతున్న కాలనీలకు డిస్కమ్‌ల ద్వారా విద్యుత్ సౌకర్యాన్ని కల్పించే ప్రక్రియ జోరుగా సాగుతోంది. ప్రతి ఇంటికీ పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో అధికారులు ఆయా పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఏపీఈపీడీసీఎల్) ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న కాలనీల్లో విద్యుద్దీకరణ పనులు జోరుగా సాగుతున్నాయి. స్తంభాల ఏర్పాటు, లైన్లు వేయడంతో పాటు పూర్తయిన ఇళ్లకు విద్యుత్ మీటర్లు అమర్చే పనిలో సిబ్బంది నిమగ్నమై ఉన్నారు. శ్లాబు దశ పూర్తయిన వెంటనే కనెక్షన్ అందిస్తుండటంతో అటు లబ్ధిదారులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

4,642 లేఅవుట్స్.. రూ.1,198 కోట్లు

ఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కోనసీమ డా.అంబేద్కర్, తూర్పుగోదావరి, కాకినాడ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలున్నాయి. ఈ 11 జిల్లాల పరిధిలో 5 సర్కిళ్లలోని 4,642 లేఅవుట్స్‌లో 4,72,124 మంది లబ్ధిదారులకు జగనన్న ఇళ్లు అందించారు. ఈ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ ప్రక్రియ చురుగ్గా సాగుతుండటంతో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా.. విద్యుత్ సౌకర్యం పనులు కూడా యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. మొత్తం రూ.1198.52 కోట్లను పేదల విద్యుత్ సరఫరా కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తోంది.

జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ ఇలా..

సర్కిల్	లేఅవుట్స్	లబ్ధిదారులు	విద్యుదీకరణ (రూ.కోట్లలో)
శ్రీకాకుళం	877	54,892	154.43
విజయనగరం	907	53,667	267.89
విశాఖపట్నం	956	57,558	108.13
తూర్పుగోదావరి	758	1,66,659	382.63
పశ్చిమగోదావరి	1144	1,39,348	285.44
మొత్తం	4642	4,72,124	1198.52

ఇప్పటికే రూ.704 కోట్ల పనుల పూర్తి

ఇప్పటివరకు 3,466 లేఅవుట్స్‌లో పనుల్ని పూర్తి చేశారు. మొత్తం 1,86,776 ఇళ్లకు విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు. ఇందుకోసం ఇప్పటికే రూ.704 కోట్లను వెచ్చించారు. ఆయా లేఅవుట్స్‌లో ఇందుకోసం 33 కేవీ, 11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లు మొత్తం 43 నిర్మిస్తుండగా.. ఇప్పటి వరకూ 30 పూర్తి చేశారు. 202 కి.మీ మేర 33 కేవీ లైన్లు పూర్తి చేయగా 1,959 కి.మీకి గానూ 379 కి.మీ మేర 11 కేవీ లైన్లు, 1,203 కి.మీ మేర 6.3 కేవీ లైన్లకు గాను 250 కి.మీ, 4,185 కి.మీలకు గాను 1,937 కి.మీ మేర ఎల్‌టీ లైన్లు, 10,444 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లకు గాను 6,318 వరకు ఏర్పాటు చేయడం విశేషం. ప్రతి ఇంటిలోనూ విద్యుత్ వెలుగులు నింపాలనే లక్ష్యంతో ఈపీడీసీఎల్ అధికారులు సైతం నిరంతరం పనుల్ని పర్యవేక్షిస్తున్నారు. ఎప్పటికప్పుడు పురోగతిపై ఆరా తీస్తూ లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నారు.

ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాం..



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో నిర్మిస్తున్న జగనన్న ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించే ప్రక్రియపై సీఎండీ ఆధ్వర్యంలో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రతి ఇంటికీ విద్యుత్ కనెక్షన్‌ను నిర్దేశిత సమయానికి అందించేందుకు సిబ్బంది చురుగ్గా పనిచేస్తున్నారు. ఈ పథకంలో భాగంగా గృహ లబ్ధిదారులకు విద్యుత్ మీటర్‌తో పాటు సర్వీస్ వైర్, మీటర్ బోర్డు, సర్క్యూట్ బ్రేకర్, ఎర్తింగ్ సదుపాయాల్ని ఉచితంగా అందిస్తున్నాం. ఆయా జిల్లాల్లో పనులు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థలు ఎప్పటికప్పుడు మెటీరియల్‌ని ముందస్తుగా తీసుకురావాలనీ.. పనుల్లో జాప్యం ఉండకూడదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ తనిఖీలు కూడా నిర్వహిస్తున్నాం.

– పృథ్వీతేజ్ ఇమ్మడి, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ

కిడ్నాప్ కలకలం సుఖాంతం

- బాబామెట్టలో కిడ్నాప్‌నకు పాల్పడిన సుపారీ గ్యాంగ్ అరెస్ట్
- ముగ్గురు వ్యక్తులు, ఒక మహిళ, ఇద్దరు జువైనల్స్ అరెస్ట్

విజయనగరం క్రైమ్: బాబామెట్టలో ఈ నెల 6వ తేదీన ఓ వ్యక్తిని కిడ్నాప్‌నకు పాల్పడిన సుపారీ గ్యాంగ్‌ను అరెస్టు చేసినట్టు విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు తెలిపారు. వారి నుంచి కిడ్నాప్‌నకు వినియోగించిన మోటారు సైకిల్, కారు, తులంన్నర బంగారు వస్తువులు, ఖాళీ ప్రాంసరీ నోట్లు, ఖాళీ తెల్లకాగితాలు, ఆధార్ కార్డులు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. శనివారం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బొందెల గూడెంకు చెందిన జోగ శివకిశోర్, జమ్మునారాయణపురానికి చెందిన కటకోటి సతీష్‌కుమార్ షాపును అద్దెకు తీసుకున్నాడు. మంచినీటి సరఫరా చేసే వ్యాపారం నిర్వహించాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య స్నేహం ఏర్పడింది. జోగ శివకిశోర్ నుంచి రూ.7 లక్షలు సతీష్ అప్పుగా తీసుకున్నాడు. సకాలంలో అప్పును చెల్లించకపోవడంతో సతీష్‌పై కోర్టులో కేసు వేశాడు. ఆర్థిక విషయాలపై ఇరువురి మధ్య గొడవలు జరగడంతో కిశోర్ తన వ్యాపారాన్ని బాబామెట్టకు మార్చేశాడు. దీంతో ఆగ్రహించిన సతీష్.. కిశోర్‌ను కిడ్నాప్ చేసేందుకు అతని స్నేహితుడైన భీమిలికి చెందిన చుక్కా నూతన్ సాయికుమార్‌ను ఆశ్రయించాడు. అతనికి ఈ తరహా దందాలకు పాల్పడే భీమిలికి చెందిన బంగారి గణేష్ పరిచయం చేశాడు. వారి గ్యాంగ్‌తో కిడ్నాప్ చేసేందుకు రూ.7 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. సతీష్ ఫోన్‌పే ద్వారా సాయికుమార్‌కు దఫదఫాలుగా రూ.15వేలు, గణేష్‌కు రూ.15వేలు అడ్వాన్స్‌గా పంపించాడు. శివకిశోర్‌ను కిడ్నాప్ చేసేందుకు ఓ పథకం ప్రకారం ఫిబ్రవరి 6న బాబామెట్టకు గ్యాంగ్ సభ్యులు చేరుకున్నారు. శివకిశోర్ వాటర్ సరఫరా చేసేందుకు వ్యాన్‌లో బయలు దేరుతుండగా భీమిలికి చెందిన సురగల వరలక్ష్మి, ఇద్దరు జువైనల్స్ మోటారు సైకిల్‌పై వచ్చి అడ్డంగా పడిపోయినట్టు నటించారు. నిందితులు శివకిశోర్‌ను బలవంతంగా కారులో ఎక్కించుకుని, పూసపాటిరేగ మైలాన్ కంపెనీ వైపు తీసుకువెళ్లి, అక్కడ కత్తితో బెదిరించి, 15 ఖాళీ ప్రాంసరీ నోట్ల మీద, తెల్లకాగితాల మీద, ఆధార్‌కార్డు జెరాక్స్‌లపైన సంతకాలు చేయించుకున్నారు. విచక్షణ రహితంగా చేతులతో ముఖం మీద కొట్టారు. ఆయన వద్ద ఉన్న రూ.1500 నగదు, తులంన్నర బరువు గల ఒక చైన్, రెండు ఉంగరాలను కూడా తీసుకుని, అక్కడే విడిచిపెట్టి వెళ్లిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కిశోర్, నూతన్ సాయికుమార్, బంగారి గణేష్, వరలక్ష్మి, ఇద్దరు జువైనల్స్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి ఫోన్, రూ.1500 నగదు, అరతులం బరువు గల రెండు బంగారు ఉంగరాలు, తులం బరువు గల ఒక బంగారు చైన్, మోటారు సైకిల్, కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. గణేష్ గతంలో ఆనందపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఒక హత్యకేసులో నిందితుడిగా ఉన్నాడు.

మార్గదర్శకాల అమలులో పొరపాట్లకు తావివ్వొద్దు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ మయూర్ అశోక్, డీఆర్వో మోహన్ కుమార్

మహారాణిపేట: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, సూచనల అమలులో ఎటువంటి పొరపాట్లకు తావివ్వరాదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా కలెక్టర్లను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో కమిషన్ కొత్తగా జారీ చేసిన మార్గదర్శకాలు, సూచనలు తప్పక పాటించాలని వివరించారు. సాధారణ ఎన్నికల సన్నద్ధత, నిర్వహణ ఏర్పాట్లపై శనివారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నిర్వహణకు దాదాపు ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. కొత్తగా ఓటు నమోదు చేసుకున్న వారికి, మార్పులు, చేర్పులకు సంబంధించి ఎపిక్ కార్డులు రావాల్సి ఉందన్నారు. సమావేశంలో జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్ కుమార్, ఆర్డీవోలు డి.హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

గెలిపించేందుకు ప్రజంతా సిద్ధమే..



మళ్ల విజయ ప్రసాద్‌ను సత్కరిస్తున్న కోలా గురువులు, అనుబంధ విభాగాల ఇన్‌చార్జులు

- వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకుడు మళ్ల విజయప్రసాద్

కొమ్మాది: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకుడు మళ్ల విజయ ప్రసాద్ అన్నారు. శనివారం ఎండాడలో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఆధ్వర్యంలో జోనల్, జిల్లా అనుబంధ విభాగాల ఇన్‌చార్జులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు అనుబంధ విభాగాల అధ్యక్షులు ఏవిధంగా పనిచేశారో.. ఇప్పుడు అంతకు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతీ వార్డులో పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టీడీపీ నాయకులు, కేడర్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ నుంచి ఎల్లప్పుడూ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు మాట్లాడుతూ భీమిలిలో జరిగిన ఎన్నికల శంఖారావంతో ప్రతిపక్షాలకు భయం పట్టుకుందని, కార్యకర్తలు, నాయకులు పార్టీ విజయం కోసం అంకితభావంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ కార్యాలయం పర్యవేక్షకుడు రవిరెడ్డి, జోనల్ విభాగం ఇన్‌చార్జులు ముత్తంశెట్టి వెంకట శివ సాయి నందీష్, పీలా వెంకటలక్ష్మి, అల్లంపల్లి రాజబాబు, బర్కత్ అలీ, కలిదిండి బద్రినాథ్, వంకాయల మారుతీ ప్రసాద్, జిల్లా అనుబంధ విభాగం అధ్యక్షులు ఆళ్ల శివగణేష్, అడ్డాల కృపా జ్యోతి, మన్యాల శ్రీనివాస్, కె.వి.బాబా, బోని శివరామకృష్ణ, పెంట్ర అప్పన్న, వానపల్లి ఈశ్వరరావు, బయవరపు రాధ, కోరడ అప్పల స్వామినాయుడు, అద్దేపల్లి రవిబాబు, నాగిరెడ్డి కిరణ్ , పూర్ణనంద శర్మ పాల్గొన్నారు.


నేటి నుంచి ఆస్పత్రి ఉద్యోగులకు క్రీడలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, చిత్రంలో కేజీహెచ్ ఏడీ శ్రీనివాస్ కుమార్

మహారాణిపేట: కేజీహెచ్, ఆంధ్రా మెడికల్ కాలేజీ సంయుక్త నిర్వహణలో ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాలు ఆదివారం ప్రారంభంకానున్నాయి. ఈ పోటీలు ఈనెల 15 వరకు జరుగుతాయి. దీనికి సంబంధించి పోస్టర్‌ను శనివారం తన చాంబర్‌లో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ విడుదల చేశారు. కేజీహెచ్, ఏఎంసీ వందేళ్ల ఉత్సవాలను పురస్కరించుకొని ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించడానికి ప్రణాళిక రూపొందించారు. అందులో భాగంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆలోచన నుంచి ఉద్భవించిన ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాలను స్ఫూర్తిగా మెగా స్పోర్ట్స్‌ను నిర్వహిస్తున్నారు. ఆదివారం నుంచి 15 వరకు అవుట్ డోర్, ఇండోర్ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్ తెలిపారు. క్రికెట్, వాలీబాల్, బాడ్మింటన్, టెన్నిస్, అథ్లెటిక్స్, చెస్, క్యారమ్స్ తదితర పోటీలు ఉంటాయన్నారు. కేజీహెచ్, ఏఎంసీ, ఇతర ఆస్పత్రుల ఉద్యోగులంతా క్రీడోత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. ఉద్యోగుల్లో క్రీడాస్ఫూర్తి కల్పించడానికి పోటీలు నిర్వహిస్తున్నట్టు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ తెలిపారు. ఇప్పటి వరకు 470 మంది ఉద్యోగులు పేర్లు నమోదు చేసుకున్నారని ఏడీ వివరించారు.

ఎంఎస్ఎంఈల బలోపేతమే లక్ష్యం



భారతమాత, విశ్వకర్మ చిత్రపటాల వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న లఘు ఉద్యోగ భారతి, వాసీవా, ఐలా ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఎంఎస్ఎంఈ యూనిట్లను ఆర్థికంగా బలోపేతం చేయడమే లఘు ఉద్యోగ భారత్ లక్ష్యమని ఏపీ లఘు ఉద్యోగ భారతి అధ్యక్షుడు మాదాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఆటోనగర్‌లోని వాసీవా భవనంలో ఎంఎస్ఎంఈలతో విశాఖపట్నం యూనిట్ లఘు ఉద్యోగ భారతి ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లఘు ఉద్యోగ భారతి జాతీయ కార్యనిర్వాహక కమిటీ మెంబర్ ఎ.కె.బాలాజీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు లక్ష మంది ఈ సంస్థలో సభ్యులుగా ఉన్నారన్నారు. నాన్ యూజీఆర్‌వో అనే బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు, ఎస్ఎస్ఈ ఎగ్జిక్యూటివ్ అరవింద్ గౌడ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎస్ఎస్ఎం సౌత్ యుగ్రో క్యాపిటల్ మెంబర్ పరమశివం, సీయాన్ ఫార్మా లిమిటెడ్ డైరెక్టర్ జెట్టి సుబ్బారావు, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉద్యోగ భారతి జాతీయ కార్యనిర్వాహక కమిటీ కో ఆర్డినేటర్ జి.అనంత్, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, ఉద్యోగ భారతి ప్రధాన కార్యదర్శి యోగేష్ చంద్ర తులసి, కార్యదర్శి జైస్వాల్, ఐలా ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.